క్లుప్తంగా

రాయితీ కల్పించాలి



కలెక్టర్ బోర్కడేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో వివిధ మీడియా సంస్థల్లో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 100శాతం ఫీజు రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావ్‌ను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రెండో విడత అక్రెడిటేషన్‌కార్డులు జారీ చేయాలని కోరారు. జిల్లా కోశాధికారి అడప సతీశ్, నాయకులు వారణాసి శ్రీనివాస్‌రావ్, రమేశ్, తూమోజు సురేశ్‌చారి, మిలీన్‌కుమార్ ఉన్నారు.

వానాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి

ఆసిఫాబాద్: వానాకాలంలో విద్యుత్ వినియోగదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఎస్ఈ వాసుదేవ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తాకరాదని పేర్కొన్నారు. అలాంటివి కనిపిస్తే వెంటనే తమశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రైతులు వ్యవసాయ పంపుసెట్లను వాడుతున్నప్పుడు విద్యుత్ మోటార్లు, పైపులను తాకకూడదని సూచించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద అనధికారికంగా ఫ్యూజులు మార్చడం, రిపేర్ చేయడం ప్రమాదకరమని పేర్కొన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు తెలుపడానికి టోల్‌ఫ్రీ నంబర్ 18004250028 లేదా 1912కు ఫోన్ చేయాలని సూచించారు.

ఏరియాలో 127 శాతం బొగ్గు ఉత్పత్తి



వివరాలు వెల్లడిస్తున్న జీఎం దేవేందర్

రెబ్బెన: గడిచిన జూన్‌లో బెల్లంపల్లి ఏరియా 127 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం దేవేందర్ అన్నారు. శనివారం గోలేటి టౌన్‌షిప్‌లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏరియాలో సాధించిన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. కై రిగూడ ఓసీపీకి గతనెలకు గానూ 2.60 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా, 3.30 లక్షల టన్నులతో 127 శాతం ఉత్పత్తిని నమోదు చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా గోలేటి ఓసీపీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. త్వరలో ఓసీపీ ఏర్పాటుకు కావల్సిన అన్ని అనుమతులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలగకుండా అన్ని చర్యలు చేపట్టామన్నారు. వర్షాలతో క్వారీలోకి చేరే వరద నీటిని ఎప్పటికప్పుడు తోడేందుకు అవసరమైన మోటర్లను సిద్ధంగా ఉంచామని అన్నారు. సమావేశంలో డీజీఎం ఐఈడీ ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం



ముళ్లపొదలను తొలగిస్తున్న యువకులు

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా సమీపంలో వాగువంతెన వద్ద యువకులు శనివారం శ్రమదానం నిర్వహించారు. కౌటాల నుంచి బెజ్జూర్ మార్గంలో ప్రధాన రహదారిపై వంతెనకు ఆనుకుని పెరిగిన ముళపొదలను తొలగించారు. శ్రీ శివరామ సాయి యూత్ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్, యువకులు బాపురావు, సంతోష్, శంకర్, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

నోటుబుక్‌లు పంపిణీ

కెరమెరి: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల గోయగాంలోని 33 మంది పదో తరగతి విద్యార్థులకు ఆదర్శ గ్రూప్ వినయ్ ఆటోటెక్ ప్రైవేటు లిమిటెడ్ మహీంద్రా షోరూం ఆసిఫాబాద్ ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా నోటుబుక్‌లు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 8 చొప్పున 264 నోటుబుక్‌లు అందించినట్లు తెలిపారు. శివ, నరేశ్, పాఠశాల హెచ్ఎం రమేశ్, టీచర్లు విజేశ్, మురళి, ప్రవీణ్ ఉన్నారు.

కంది విత్తనాల పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి, చేడ్వాయి రైతు వేదికల్లో ఏవో రాజుల నాయుడు శనివారం రైతులకు కంది విత్తనాలు అందజేశారు. ఎంపీటీసీ దూగుంట రాజన్న, ఏఈవోలు శ్రీవిద్య, గౌసియాబేగం, రైతులు పాల్గొన్నారు.

పింఛన్ పైసల్ కాజేస్తున్నారు

- పోస్టల్ సిబ్బంది చేతివాటం
- చిల్లర లేదంటూ నొక్కేస్తున్న రూ.16
- లబ్ధిదారులు ఇదేంటని అడిగితే బెదిరింపులు

మండల వ్యాప్తంగా..	ఒంటరి మహిళలు	నేత కార్మికులు	గీతకార్మికులు	దివ్యాంగులు	వితంతువులు	వృద్ధులు
	172	7	7	359	1388	1732



రవీంద్రనగర్‌లో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఉద్యోగి

చింతలమానెపల్లి: ఆసరా పింఛన్ డబ్బులను అక్రమార్కులు వదలడం లేదు. పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది వీరి పైసలను కాజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.2016, దివ్యాంగులకు రూ.3016 ఇస్తుండగా, ప్రతీ పింఛన్‌దారు నుంచి రూ.16 చిల్లర లేదని నొక్కేస్తున్నారు. మండల వ్యాప్తంగా 19 పంచాయతీల పరిధిలో 3,665 మంది పింఛన్ లబ్ధిదారులున్నారు. ఆ సంఖ్యకు రూ.16లు లెక్కిస్తే ప్రతి నెలకు రూ.58,640 వేలు అవుతోంది. చిల్లర కోసం పోస్టల్ సిబ్బందిని అడిగితే పింఛన్ రద్దుచేస్తామని బెదిరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఒకవైపు వేలిముద్రలు రాని వారికి స్థానిక కార్యదర్శి సమక్షంలో చెల్లింపులు జరపాల్సి ఉన్నా వారికి సగం డబ్బులు ఇస్తున్నారని పేర్కొంటున్నారు. మరోవైపు ఉపాధిహామీ, తునికాకు చెల్లింపుల్లో సిబ్బంది చేతివాటం చూపుతున్నారని ఆరోపణలున్నాయి. కమీషన్ ముట్టనిదే చెల్లింపులు జరపడం లేదని ఉపాధి కూలీలు ఆరోపిస్తున్నారు. ఈవిషయంపై పోస్టమాస్టర్‌తో సాక్షి మాట్లాడగా తాము డబ్బులు తీసుకోవడం లేదని, తీసుకున్న డబ్బులు సర్పంచ్‌కు ఇస్తామని చెప్పడం గమనార్హం.

7 పోస్టు కార్యాలయాలు

బాబాపూర్, బాబాసాగర్, చింతలమానెపల్లి, ఖర్జెల్లి, డబ్బా, గూడెం, బాలాజీ అనుకోడ పోస్టు కార్యాలయాలు ఉన్నాయి. ఒక పోస్టమాస్టర్, పోస్టమాన్ విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఉపాధిహామీ, పింఛన్, తునికాకు చెల్లింపులు నిర్వహిస్తోంది. బ్యాంకింగ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సేవింగ్స్, పోస్టల్ లావాదేవీల సేవలను సైతం అందిస్తున్నారు. మండలంలోని రుద్రాపూర్, టిగూడ లబ్ధిదారులకు ముంజపల్లి పోస్టు కార్యాలయం ద్వారా, రణవెల్లి, బూరెపెల్లి, టేకంగూడ లబ్ధిదారులకు గుడ్లబోరి పోస్టు కార్యాలయం ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి.

రూ.16 ఇవ్వడం లేదు

మా ఇంట్లో అమ్మ, తనకు వృద్ధాప్య, కోడలుకు వితంతు పింఛన్ వస్తుంది. ఈ పింఛన్లలో వచ్చే డబ్బుల్లో రూ.16లు ఇవ్వడం లేదు. పోస్టల్ సిబ్బందిని అడిగితే బెదిరిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బుర్రి హన్మంతు, గూడెం

రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి

పింఛన్ల పంపిణీలో పోస్టల్ సిబ్బంది చెల్లింపులు సరిగా జరపడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయి. పోస్టల్ శాఖ మండల పరిషత్ పరిధిలో లేనందున చర్యలు తీసుకోలేక పోతున్నాం. లబ్ధిదారులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో

చర్యలు తీసుకుంటాం

పోస్టల్ సిబ్బంది పింఛన్ లబ్ధిదారులకు రూ.16లు ఇవ్వడం లేదని ఆరోపణలు గతంలో వచ్చాయి. విచారణకు వెళ్లిన సందర్భంలో లబ్ధిదారులు సహకరించలేదు. ఎవరైన నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– సతీశ్, పోస్టల్‌శాఖ ఇన్‌స్పెక్టర్, కాగజ్‌నగర్

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ఇందానీలో మాట్లాడుతున్న కోట్నాక విజయ్

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్

తిర్యాణి: కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రజలకు తెలపాలన్నారు. పార్టీని బూత్ స్థాయిలో బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ అసెంబ్లీ కోకన్వీనర్ సార రమేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్, నాయకులు ఆత్రం గోపాల్, తోంగల తిరుపతి, భాస్కర్, గాయంగి తిరుపతి, రమేశ్‌సింగ్, ప్రవీణ్, బారిక్‌రావు, బాలకిషన్ ఉన్నారు.

వాంకిడి: ఇందాని ఖిరిడి గ్రామాల్లో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్ ఇంటింటికీ తిరిగి కేంద్ర పథకాలను వివరించారు. మండల విస్తారక్ సురేశ్‌సింగ్ పాల్గొని ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలగతి సుచిత్, నాయకులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో శనివారం గడప గడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. మేరా బూత్ సబ్‌సే మజ్బూత్‌లో భాగంగా అల్పకాలిక్ విస్తారిక్ భార్గవరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర పథకాలను పార్టీ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు దిగువ శ్రీనుసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పార్టీ నాయకులు పట్టణంలోని వార్డు నం.7 మారుతి నగర్‌లో శనివారం గడప గడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ నాయకుడు వెంకటేశ్, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు బీజేపీ సమావేశం

మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు తెలిపారు. పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి పి.మురళీధర్‌రావు హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ప్రశాంతంగా గ్రూప్ 4 పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: భారీ పోలీసు బందోబస్తు మధ్య పట్టణంలో శనివారం గ్రూప్–4 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పేపర్–2 పరీక్ష నిర్వహించారు. ప్రతి కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు కేంద్రం గేట్లు మూసివేయగా, వసుంధర, సెంట్ క్లారిటీ పరీక్ష కేంద్రంలో రెండు నిమిషాల ఆలస్యంగా వచ్చిన ఇద్దరిని ముందుగా నిరాకరించినా ఆ తర్వాత అనుమతినిచ్చారు. మధ్యాహ్నం కేవలం రెండు, మూడు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన సుప్రభాత్ పాఠశాల కేంద్రంలో పలువురు అభ్యర్థులను ముందుగా నిరాకరించినా, ఆ తర్వాత అనుమతినిచ్చారు. బాలాజీనగర్‌లోని కేరళ పబ్లిక్ పాఠశాలలో పరీక్షకు హాజరైన అభ్యర్థులకు కాలనీవాసులు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.



పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు

ఫలితాలను వెంటనే విడుదల చేయాలి

01ఎఎస్‌బి56 మాట్లాడుతున్న తిరుపతి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన గ్రూప్ 4 పరీక్ష ఫలితాలను వెంటనే విడుదల చేయాలని సీపీఎం(ఎంఎల్) రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి గోగర్ల తిరుపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కల నెరవేరాలంటే ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ఫలితాలను విడుదల చేయాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు ఫలితాలతోపాటు భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో రాజేష్ పాల్గొన్నారు

అందని వైద్యం

- రొంపెల్లి పీహెచ్‌సీలో దుస్థితి
- వైద్యుడి పోస్టు ఖాళీ
- నలుగురి సిబ్బందితో ఆస్పత్రి నిర్వహణ
- ఆదివాసీలు, రోగుల ఇక్కట్లు

తిర్యాణి: దశాబ్దాలుగా ఆదివాసీలకు వైద్యం అందని ద్రాక్షగా మారింది. ఏళ్లుగా వైద్యం అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి మెరుగైన వైద్యం అందించాల్సి ఉండగా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. సకాలంలో వైద్యం అందక పోవడంతో గర్భిణులు, రోగులు, పలువురు ఆదివాసీలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇదీ తిర్యాణి మండలంలోని రొంపెల్లి పీహెచ్‌సీలో ఈ దుస్థితి. వైద్యుడు పోస్టు ఖాళీగా ఉంది. ఆసుపత్రి నిర్వహణను ఉన్న నలుగురి సిబ్బందే చూడాల్సిన పరిస్థితి. డాక్టర్, ల్యాబ్ టెక్నీషియన్, మిగతా సిబ్బంది లేక వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

రొంపెల్లి పీహెచ్‌సీ పరిధిలో..

రొంపెల్లి పీహెచ్‌సీ పరిధిలో దాదాపు 50 గ్రామాలున్నాయి. ప్రస్తుతం ఈ ఆసుపత్రిలో కేవలం నలుగురు సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడి వైద్యుడిని తల్లీబిడ్డల సంరక్షణ జిల్లా ప్రోగాం ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతోపాటు డీడీవోగా కూడా అదనపు బాధ్యతలను అప్పజెప్పారు. అప్పటి నుంచి వైద్యుడు నెలకోసారి పీహెచ్‌సీకి రావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. కాగా, ప్రభుత్వం ఇటీవల నూతనంగా ప్రారంభించిన సంతర ఆసుపత్రికి రొంపెల్లి ల్యాబ్ టెక్నీషన్‌ను డిప్యూటేషన్‌పై పంపించారు. ఇక్కడ ఇద్దరేసి చొప్పున వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు అవసరం ఉంది.



రొంపెల్లి ప్రాథమిక ఆసుపత్రి

గర్భిణుల పాట్లు

ల్యాబ్‌టెక్నీషియన్ లేకపోవడంతో రక్తపరీక్షల కోసం వచ్చే గర్భిణులు పడరాని పాట్లు పడుతున్నారు. సరిపడా హిమోగ్లోబిన్ ఉందో లేదో తెలియక ప్రసవం సమయంలో సమస్యలు ఎదుర్కొంటున్నారు. నాడీ పట్టేవారు, పరీక్షలు చేసేవారు లేక మంగి, గుండాల, కౌటగాం తదితర సుదూర ప్రాంతాల నుంచే వచ్చే రోగులు ఫార్మసిస్టు ఇచ్చే మందులు తీసుకోని వెళ్తున్నారు. మూరుమూల ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు స్పందించి వైద్యుడు, ల్యాబ్ టెక్నీషియన్‌తో సహ మిగతా సిబ్బందిని నియమించాలని పలువురు కోరుతున్నారు.

పట్టించుకోలేదు

జ్వరం వస్తుందని ఆసుపత్రికి వెళ్లినా డాక్టర్ లేరని చెబుతున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో రక్త,మూత్ర పరీక్షలు చేయడం లేదు. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని అధికారులను కోరినా పట్టించుకోలేదు.

– మర్సుకోల అశోక్, గుండాల

వైద్యుడిని నియమించాలి

ఆదివాసీల వైద్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదు. వారం రోజుల్లో వైద్యుడిని నియమించాలి. లేకపోతే తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతాం.

– వెడ్మ భగవంత్‌రావు, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు

ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న సింగిల్ విండో చైర్మన్

ఆసిఫాబాద్‌అర్బన్: 101వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సింగిల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్ జెండా ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు ప్రహ్లాద్, డైరెక్టర్లు రాంపల్లి విజయ, శంకర్, బాబురావ్, సీఈవో వెంకటరమణ, రైతులు ఉన్నారు.

వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే

రెబ్బెన: గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే ఆత్రం సక్కు శనివారం దర్శించుకున్నారు. గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

రెబ్బెన: గంగాపూర్‌లోని కేజీబీవీలో 6 నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్ల సంఖ్య పెంచాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ కోరారు. ఈ మేరకు కృషి చేయాలని కోరుతూ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు శనివారం వినతిపత్రం అందజేశారు. సర్పంచ్ సోమశేఖర్, కోలే శ్యాంరావ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మధునయ్య, తిరుపతి పాల్గొన్నారు.

నేడు పస్క పండుగ

దహెగాం: తొలకరి జల్లులు కురిసిన తర్వాత పచ్చగడ్డి మొలకెత్తుతున్న సమయంలో పస్క పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అదేక్రమంలో ఆదివారం పండుగ జరుపుకోనున్నారు. శనివారం దహెగాం మండల కేంద్రంలో ప్రజలు జెండాను ఎగురవేశారు. అనంతరం పాత దహెగాంలో మైసమ్మ ఆలయంలో మొక్కు చెల్లించుకున్నారు. కోళ్లను బలి ఇచ్చారు. మరుసటి రోజు పస్క పండుగ నిర్వహిస్తారని పలువురు పేర్కొంటున్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కెరమెరి: జిల్లాలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో యథేచ్ఛగా బుక్స్ దందా కొనసాగుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్.సతీశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయిస్తున్నా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు వసూళ్లు చేస్తున్నారని అన్నారు.

వార్ధా బ్రిడ్జి నిర్మాణంతో అభివృద్ధి



సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనప్ప చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కౌటాల: వార్ధా నదిపై అంతర్రాష్ట్ర వారధి నిర్మాణంతో సరిహద్దు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలంలోని గుండాయిపేట్ వార్ధా నది పై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.75 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. అంతర్రాష్ట్ర వంతెన నిర్మాణంతో కౌటాల మండల కేంద్రం.. మంచిర్యాల పట్టణం మాదిరి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. త్వరలో వంతెన పనులు ప్రారంభిస్తారని తెలిపారు. వీర్దండి వద్ద వార్ధా నది బ్యారేజీ నిర్మించి రైతులకు సాగునీరు అందించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కౌటాలకు మంజూరైన 132 కేవీ విద్యుత్ కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు ఈ వారంలో మంత్రులు జగదీశ్వర్‌రెడ్డి, ఐకే రెడ్డి వస్తారని అన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, ఎంపీపీ విశ్వనాథ్, సర్పంచ్ మౌనిశ్, కోఆప్షన్ సభ్యులు అజ్మత్ అలీ, ఉప సర్పంచ్ తిరుపతి, పార్టీ మండల యూత్ అధ్యక్షులు రవీందర్‌గౌడ్, నాయకులు బాపు, వెంకన్న, రమేశ్, మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంబురాలు

గుండాయిపేట్ వద్ద వార్ధానది పై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో శనివారం రాత్రి మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ప్రజలు, నాయకులు సంబురాలు చేసుకున్నారు. కౌటాలలోని కుమురం భీం చౌరస్తాలో, మొగడ్‌దగడ్, వీర్దండి, గుండాయిపేట్, తుమ్మిడిహెట్టి, గుడ్లబోరి గ్రామాల్లో సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.

ఘనంగా డాక్టర్స్ డే

ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో శనివారం డాక్టర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఎంఎం హెల్ప్‌లైన్ ఆధ్వర్యంలో వైద్యులు సత్యనారాయణ, అన్సారీలకు పూలమాలలతో సత్కరించారు. హెల్ప్‌లైన్ చైర్మన్ అహ్మద్ మాట్లాడుతూ వైద్యులు ఆపదలో ఆదుకుంటూ ప్రాణాలను కాపాడే దేవుళ్లని కొనియాడారు. హెల్ప్‌లైన్ ప్రతినిధులు అబ్దుల్ రహమాన్, నిసార్, అహ్మద్‌బిన్ అబ్దుల్లా, ఇమ్రాన్, ఖుర్రన్, షాహీద్, వాఖర్, కాంతు తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ సన్మానించారు. పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, ఉప సర్పంచ్ తోట లచ్చన్న, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

ఆసిఫాబాద్: జిల్లాకేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్‌డే జరుపుకున్నారు. వైద్యుడు మహేశ్, హెడ్‌నర్సు సుహాసిని, రాజనర్సమ్మను సన్మానించారు. అధ్యక్ష, కార్యదర్శులు నాంపల్లి శంకర్, వేణుగోపాల్, కోశాధికారి పుల్లూరి శంకర్, డైరెక్టర్ కోట వెంకన్న, ఉపాధ్యక్షులు ఉబేద్‌బిన్ యాహియా, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.




హెడ్‌నర్సులను సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు



వైద్యులను సన్మానిస్తున్న సభ్యులు

సినిమా పేర్లతో పత్తి విత్తన ప్యాకెట్లు

చింతలమానెపల్లి: ఖరీఫ్, రబీ సీజన్ ప్రారంభమైతే చాలు విత్తన కంపెనీలు రైతులను ఆకర్షించేందుకు ప్రయత్నాలు మొదలు పెడతాయి. ఇందులో భాగంగా జిల్లాలో స్టాలిన్, అఖండ, భీమ్లా నాయక్, పుష్ప, బౌన్సర్, బాక్సర్ సినిమా పేర్లతో పత్తి విత్తనాలను మార్కెట్‌లోకి ప్రవేశపెడుతున్నాయి. కాగా, తమ అనుభవం బట్టి పత్తి విత్తనాలు ఎంపిక చేసుకుంటామని రైతులు చెబుతున్నారు.



నిరవధిక సమ్మె విజయవంతం చేయాలి

రెబ్బెన: పంచాయతీ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు ఈనెల 6 నుంచి చేపట్టబోయే నిరవధిక సమ్మెను విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు బోగే ఉపేందర్, సుధాకర్, రమేశ్ పిలుపునిచ్చారు. రెబ్బెన పంచాయతీ కార్యాలయం వద్ద శని వారం జేఏసీ సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కార్మికుడు మానె దత్తు మృతికి సంతాపంగా జేఏసీ ఆధ్వర్యంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. నాయకులు వెంకటేష్, శంకర్, దేవాజీ, లాలూసింగ్, కిషన్, లక్ష్మి పాల్గొన్నారు.

వింతబల్లి ప్రత్యక్షం

కౌటాల: మండల కేంద్రంలో అరుదైన వింత బల్లి ప్రత్యక్షమైంది. దాసరి హరీశ్‌గౌడ్ ఇంటి వద్ద శనివారం సాయంత్రం కట్లపాములా కదులుతూ కనిపించింది. ఈ బల్లిని ఫొటో తీశారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు..దాని పేరు కామన్ హౌస్ గెకో అని తెలిపారు. వీటి ముఖం బాణాకృతిని కలిగి ఉంటుందని, శరీరంపై కట్లు ఉంటాయన్నారు. వీటితో ఎలాంటి అపాయం ఉండదన్నారు. వర్షాకాలం లేదా చలికాలాల్లో ఇవి చిత్తడి ప్రాంతాల నుంచి బయటకు వచ్చి గోడలపై చేరుకుంటాయని తెలిపారు.

